1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 29 మే 2023



ఒకే కుటుంబంలో నలుగురిని బలి తీసిన రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ - పాపన్నపేట

ఇటీవల కొల్చారం సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని కబలించింది. పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దుర్గా గౌడ్ అతని సతీమణి లావణ్య, అతడి సోదరుడు నాగరాజు గౌడ్, దుర్గ గౌడ్ కూతురు ఎనిమిది నెలల చిన్నారి హర్షిత తోపాటు దుర్గ గౌడ్ తల్లి తో కలిసి శుక్రవారం దౌల్తాబాద్ వద్ద వివాహానికి హాజరై సొంత గ్రామమైన పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్ కారులో బయలుదేరారు. కొల్చారం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు కారు ఎదురెదురుగా ఢీకొనడంతో డ్రైవింగ్ సీట్లో ఉన్న నాగరాజుగౌడ్, దుర్గాగౌడ్ కూతురు హర్షిత మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలపాలై హైదరాబాద్లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గా గౌడ్ శనివారం రాత్రి మృతి చెందారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాగౌడ్ భార్య లావణ్య సైతం ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 4కు చేరింది. నాగరాజు గౌడ్‌కు ఆరు నెలల కుమారుడు ఉండగా, దుర్గాగౌడ్‌కు నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. కేవలం ఈ చిన్నారులకు అచేతనవస్థలో ఉన్న నానమ్మ తప్ప ఎవరూ లేకపోవడంతో చిన్నారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగా ఉంది, ఇదిలా ఉండగా అందరితో కలగలుపుగా ఉండే కుటుంబం క్షణాల్లో పేకమెడల్లా కూలిపోవడంతో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మిల్లర్లే..దళారులు







నవతెలంగాణ- కొల్చారం

కొల్చారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ సెంటర్లతో పాటు రైతు సేవ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కలిపి 12 కొనుగోలు కేంద్రాలున్నాయి. ఇందులో భాగంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక బస్తా 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41 కిలోలు వేస్తున్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు, తేమ పేరుతో అవకాశాన్ని బట్టి 42 నుంచి 45 కిలోల వరకు తూకం వేసుకుంటున్నారు. అంటే క్వింటాలు ధాన్యానికి 9కిలోల మేరకు అదనంగా దోచుకుంటున్నారు. ఇదేమిటని ఎవరైనా రైతులు ప్రశ్నిస్తే వాళ్ల ధాన్యాన్ని దించుకోకుండా వాపసు పంపిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊరూరికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరలు కల్పిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుండగా, ఆయా కేంద్రాల వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే నష్టపోయి

- దళారీ వ్యవస్థకు దారులు వేస్తున్న వైనం
- బాలాజీ ఇండస్ట్రీలో రూ.1,800లకు క్వింటాల్
- నియంత్రించాల్సిన అధికారుల జాడేదీ?
- పేరుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- అదును చూసి దెబ్బకొడుతున్న మిల్లర్లు
- ఏమిటని అడిగితే.. అంతేసంగతి
- క్వింటాలకు 10కిలోల మేర తరుగు

ఉండడంతో కనీసం రైతుల పట్ల కనికరం లేకుండా రైస్ మిల్లర్లు అధిక దోపిడీ చేస్తున్నారని వాపోయారు. ఇంత జరిగినా అధికారులు అక్రమార్కుల పట్ల చర్యలు తీసుకోకపోవడం వెనుక మతులబు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

దళారీ వ్యవస్థకు ఇదే నిదర్శనం

దళారీ వ్యవస్థను రూపుమాపాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయినా రైతులు పండించిన ధాన్యం దళారుల పాలు అవ్వక తప్పడం లేదు. ఇందుకు నిదర్శనం కొల్చారం మండలం దుంపలకుంట బాలాజీ ఇండస్ట్రీస్ యాజమాన్యమే అని చెప్పుకోవచ్చు. పక్కా ప్లాన్‌తో అడ్డదారిన ప్రైవేటుపరంగా ధాన్యం కొనుగోలు చేయాలంటే రైతులకు నానా తిప్పలు పెట్టక తప్పదన్న ఆలోచనతో స్కెచ్ వేసింది బాలాజీ ఇండస్ట్రీస్. ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బాలాజీ ఇండస్ట్రీస్‌కు దిగుమతి కోసం వెళ్లిన లారీలను త్వరితగతిన అన్లోడింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్కడి లారీలు అక్కడే రోజుల తరబడి నిలిచిపోయాయి. తూకం వేయని రైతులు బాలాజీ ఇండస్ట్రీస్ యాజమాన్యం పెడుతున్న ఇబ్బందులను భరించలేక ఎంతో కొంత ధాన్యాన్ని అమ్ముకోవాలన్న ఆలోచనతో ప్రైవేటుపరంగా రూ.1800 క్వింటాలు చొప్పున ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని అన్లోడింగ్ చేయకుండా ప్రైవేట్ ధాన్యం లారీలను త్వరితగజినల్ అన్లోడింగ్ చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపించారు. బాలాజీ ఇండస్ట్రీస్ చేస్తున్న అక్రమ దందాపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

> కొనుగోలు కేంద్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ధాన్యం తూకంలో రైస్‌మిల్లర్ల దోపిడీ ఆగడం లేదు. మిల్లుల వద్ద తరుగు పేరిట కోతలు విధిస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కుమిలిపోతున్నారు. కోతలకు అంగీకరించకుంటే ధాన్యాన్ని మిల్లుల వద్ద లారీల నుంచి దించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ముంచేస్తున్న కొనుగోలు సెంటర్లు

నవతెలంగాణ కౌడిపల్లి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు కొనుగోలు సెంటర్లలో అక్రమాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కౌడిపల్లి మండలంలో 29 గ్రామపంచాయతీ గాను 26 వడ్ల కొనుగోలు సెంటర్లు ఉన్నాయి. ఐకేపీ ద్వారా 8 మమ్మద్ నగర్ సొసైటీ ద్వారా 16 జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం 3 సెంటర్లలో వడ్లు కొనుగోలు చేస్తున్నారు. యాసంగి సీజన్లో మండలంలో దాదాపు 16,500 ఎకరాలలో రైతులు వరి సాగు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ల కన్నా దళారులకే అమ్ముకోవడం మేలని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత 30 రోజులు అవుతున్న సెంటర్లలో నుండి వడ్లు తూకం వేయకుండా ఎండలోనే ఉంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలు పండించిన పంట కన్నా వడ్లను అమ్ముకోవడం చాలా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. లారీల కొరత ద్వారా రైస్ మిల్లర్లకు జిల్లా అధికారులు కుమ్మక్కై 43 కిలోల 100 గ్రాములు తూకం వేస్తున్నారని రైతులు తెలిపారు. జిల్లా అధికారులు రైస్ మిల్లర్ల యజమానుల తో కమిషన్ల కోసం రైస్ మిల్లర్లకు మద్దతు తెలుపుతున్నారు. వర్షాకాలంలో లేని లారీల ఇబ్బంది ఇప్పుడు ఎందుకు వచ్చిందని రైతులు ప్రశ్నిస్తున్నారు దాదాపు నెల రోజులకు టాపర్ల కిరాయి 5000 అవుతుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం 41 కిలో 300 గ్రాములు ఇవ్వాలని తెలుపగా కానీ రైస్ మిల్లర్లు ఇలా ఇస్తే లారీలను తిరిగి పంపిస్తున్నారని 43 కిలోల 100 గ్రాములు ఇస్తేనే రైస్ మిల్ యజమానులు తీసుకుంటున్నారని రైతులు తెలుపుతున్నారు. చేసేదేమీ లేక రైతులు రైస్ మిల్ యజమానులు చెప్పినట్టుగానే 43 కిలోల 100 గ్రాములు తూకం వేసి ప్రైవేటు ట్రాక్టర్లలో డీసీఎంలలో ధాన్యాన్ని రైస్ మిల్ తరలిస్తున్నారు కొనుగోలు కేంద్రాలకు వచ్చే కమిషన్ రైస్ మిల్లర్లు ద్వారానే జిల్లా అధికారులకు లంచాలు పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు మహమ్మద్ నగర్ సొసైటీ అధికారుల ఇష్టారాజ్యంగా వారికి అనుకూలంగా ఉన్న రైతులకు తూకం వేస్తూ ధాన్యాన్ని తరలిస్తున్నారు ఇంకో నెల 15 రోజులలో వర్షాకాలంలో వస్తుందని దుఖాలు పోసుకునే సమయం వచ్చిన రైతులు మాత్రం వడ్ల కొనుగోలు సెంటర్లోని రాత్రులలో నిద్రిస్తూ ధాన్యాన్ని కాపలాగా ఉంటున్నారు ప్రభుత్వ అధికారులు గానీ నాయకులు గానీ రైతుల కష్టాలను పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చెందారు కొంతమంది రైతులు ప్రైవేట్‌గా లారీలను తెచ్చుకొని పది నుంచి పదిహేను రూపాయలకు బస్తా కాడికి కిరాయి ఇచ్చి రైస్ మిల్ కు తరలిస్తున్నారు రైతులు పెట్టిన డబ్బులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ఆ కిరాయి సొసైటీ ఖాతాలో వేసుకుంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

యాస్టపడి అమ్మిన



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ఇబ్బందులను బరించలేక ఎఫ్ సీఐ నుండి కొనుగోలు చేస్తున్న బాలాజీ ఇండస్ట్రీస్ యాజమాన్యం వారు ప్రైవేటు పరంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వారికే రూ.1800 కు క్వింటాలు చొప్పున అమ్మినం.

- మల్లేశం, రైతు

తక్కువకు అమ్మి నష్టపోతున్నం



అవసరానికి అమ్ముడు పోక ఎంతకో కొంత అమ్ముకుంటున్నం. ఎఫ్ సీఐ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యంలో క్వింటాలు కు 10 కిలోలు తరుగు తీస్తున్నరు. రైస్‌మిల్ యజ మానులే రూ.1800 క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నరు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నం.

- అంజనేయులు, రైతు

దళారులకు వడ్లు అమ్మడమే మేలు



ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు సెంటర్ల కన్నా వడ్లను ప్రస్తుత కాలంలో దళారులకు అమ్మడమే మేలు. సెంటర్లలో సొసైటీ అధికారుల ఇబ్బందులకు టార్పాలిన్ల కిరాయి దాదాపు రూ.5 వేలు అయింది. దళారులు క్వింటాల్‌కు 1850 ఇచ్చి వ్యవసాయ పొలాల దగ్గరనే కొనుగోలు చేస్తున్నారు.

- కూరగాయల రాములు

యాసంగిలో ఇబ్బంది ఎందుకు?



వర్షాకాలంలో లేని లారీల కొరత యాసంగిలో ఎందుకు వచ్చింది. వడ్ల కొలుగోడు సెంటర్ దగ్గర రైతుల పడుతున్న ఇబ్బందులను రైతులను పట్టించుకోకపోవడం బాధాకరం. ధాన్యాన్ని తూకం వేయకపోవడం సొసైటీ ఐకెపి అధికారుల నిర్లక్ష్యమే.

- చిలుముల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు

మిల్లర్లతో అధికారుల కుమ్మక్కు



రైస్ మిల్లర్లు సొసైటీ ఐకెపి అధికారుల కుమ్మక్కుతో కమిషన్ల కోసం రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. కొనుగోలు సెంటర్లలో వారికి అనుకూలంగా ఉండే వారికే లారీలను డీసీఎంలను తీసుకొచ్చి ధాన్యాన్ని తరలిస్తున్నారు.

- బండప్ప

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ మెదక్ రూరల్

జూన్ 2 నుంచి చేపట్టనున్న తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో గత తొమ్మిది సంవత్సరాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని పల్లె పల్లెన ప్రజలకు వివరించే విధంగా 21 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చక్కటి కార్యాచరణతో కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వచ్చే జూన్ 2 నాటికి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకుని 10వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు పండుగ వాతావరణంలో రోజు ఒక కార్యక్రమం చొప్పున జూన్ 22 వరకు వివిధ శాఖల ద్వారా అమలు పరుస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టుటకు షెడ్యూల్ ప్రకటించిందన్నారు. దశాబ్ది ఉత్సవాలలో నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని, అందరూ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వం సూచించిన క్యాలెండర్ ప్రకారం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షా



సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 9 ఏండ్ల తెలంగాణ ప్రస్థానంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని నేడు దేశం గర్వించదగ్గ స్థాయిలో అన్ని రంగాలలో పురోగమించామన్నారు. జూన్ 2 న పతాకావిష్కరణ , దశాబ్ది ఉత్సవ సందేశం తో ఉత్సవాలు ప్రారంభమై జూన్ 22 అమరవీరుల సంస్మరణ సభ,అమరవీరుల స్థూపం అవిష్కరణతో ముగిస్తుందన్నారు. 20 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ఊరూరా పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రగతిని ప్రతి ఒక్కరికి తెలిసేలా వెలుగెత్తి చాటాలన్నారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరొక్కసారి గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతు వేదికల వద్ద ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రైతులతో కలిసి భోజనం చేయాలని అన్నారు. నూతన మండలాలు, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత దగ్గరైందన్న విషయాన్ని అవగతం చేయాలన్నారు. ఒక్కో గ్రామానికి అందుతున్న రైతు బంధు, రైతు భీమా, వివిధ రకాల పెన్షన్లు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మీ, చెరువులో చేప పిల్లలు వదలడం, గొర్రెల పంపిణీ అన్ని రకాల వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా సాగునీటి చెరువుల పునరుద్ధరణ, గ్రామాల్లో చెక్ డ్యాములు, ఊట చెరువుల నిర్మాణం తో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రం వస్తే చీకటి అవుతుందని చెప్పిన చోట నేడు విద్యుత్తు వెలుగులు చిమ్ముతూ 9 ఏళ్లలో సాధించిన ప్రగతిని గర్వంగా చాటుకుంటు ప్రజలతో మమేకం అవుతూ ప్రచారం చేయాలన్నారు.పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన పనుల వివరాలతో పాటు అన్ని రకాల అభివృద్ధి నిధుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఆధునికతతో ఉపాధి కోల్పోయిన కుల వృత్తుల వారికి అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించి ఒక లక్ష రూపాయలు ఇవ్వనుందని అన్నారు. అదేవిధంగా అర్హులైన గిరిజనులకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వనున్నామని అన్నారు. అర్హత గల వారికి ఇంటి స్థలాల పట్టాలు అందజేయాలని తెలిపారు. జూన్ 19న జరిగే తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా కోసం జరుగుతున్న కృషిని, మన ఊరు- మన బడి కింద పాఠశాలల్లో వచ్చిన మార్పును నాడు-నేడు ఫొటోలతో ప్రదర్శించాలన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతితో జాతీయ స్థాయి అవార్డులు సాధించి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జూన్ 24 నుండి 30 వరకు అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని, జులై మొదటి వారంలో దళిత బంధు యూనిట్లు గ్రౌండింగ్, ప్రతి నియోజక వర్గంలో స్వంత జాగా ఉన్న 3 వేల మందికి ఆర్థిక సహాయం అందించి ఇండ్లు ప్రారంభించడం, కొత్త సభ్యత్వాలు తీసుకున్న మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందించాలన్నా రు. ఎస్సీ,ఎస్టీ, బిసి లకు సంబంధిచి అసైన్డ్ ల్యాండ్ వారసత్వ మార్పు చేసి అర్హత పొందేవిధంగా చూడాలన్నారు. పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపని వాటిని గుర్తించి లే అవుట్ చేసి నంబరింగ్ ఇవ్వాలన్నారు. సంక్షేమ సంబరాలలో భాగంగా 2వ విడత గొర్రెల పంపిణి, వృతి కులాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఏ ఒక్క ఆరోగ్య ఉప కేంద్రం అద్దె భవనాల్లో, శిథిల భవనాల్లో ఉండకుండా అన్నిటి ప్రతిపాదనలు పంపితే ,మూడు మాసాలలోగా నిర్మాణాలు గావించాలన్నారు. మన ఊరు మనబడి పనులలో ఉమ్మడి జిల్లా ముందున్నదాను పనులు మరింత వేగవంతం చేసి విద్యా దినోత్సవం నాడు ప్రారంభించాలన్నారు. జిల్లాలో 70 శాతం మేర ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూరయ్యిందని, ఇప్పటి వాకు 2 కోట్ల 20 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, సోమవారం పౌర సరఫరాల సంస్థ చైర్మన్, కమీషనర్ లను జిల్లా కు పంపి మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి వేగవంతానికి ఆదేశాలిస్తామన్నారు. సమావేశంలో మెదక్, సిద్దిపేట జిల్లా పరిషద్ చైర్ పర్సన్లు హేమలత శేఖర్ గౌడ్, రోజా శర్మ, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్, మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు రాజర్షి షా, ప్రశాంత్ జీవన్ పాటిల్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత, సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్, మెదక్, తూప్రాన్ డిఎస్పీలు సైదులు, యాదవ రెడ్డి, పార్లమెంటు సభ్యులు బిబి పాటిల్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, , శాసనసభ్యులు మెదక్ పద్మా దేవేందర్ రెడ్డి , నర్సాపూర్ మదన్ రెడ్డి, జహీరాబాద్ మాణిక్ రావు, అందోల్ చంటి క్రాంతి కిరణ్, నారాయణఖేడ్ భూపాల్ రెడ్డి, హుస్నాబాద్ సతీష్, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



సెర్ప్ సంస్థలో గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలలో వీవోఏలుగా పని చేస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత లేకపోవడంతో వీవోఏలు సమ్మె బాట పట్టారు. సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించి వీవోఏలు గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. గ్రామాలలో మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తూ... మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రుణాలను ఇప్పిస్తూ... బ్యాంకుకు తిరిగి రుణాలు కట్టించడంలోనూ వీవోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలలో అన్ని తామే అయి ముందుండి చూసుకుంటున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి తమకు తగిన గుర్తింపు రావడం లేదని వీవోఏలు ఆవేదన చెందుతున్నారు. వీవోఏలను గ్రామాలలో పుస్తక నిర్వహణ కోసం ఎంపిక చేసిన ప్రభుత్వం ఈరోజు వారితో ఎన్నో రకాల ఆన్లైన్ పనుల పేరుతో వీవో ట్రాన్సాక్షన్, వీవో అకౌంట్, ఎస్ఆర్ఎల్పి, వీపీఆర్పీ వంటి ఆన్లైన్ పనులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో ముందున్నప్పటికీ తమను ప్రభుత్వాలు గుర్తించడం లేదని వీవోఏలు ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు ఈ నెల 29న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీవోఏల సమ్మెకు సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ శ్రమను గుర్తించి కనీస గౌరవ వేతనాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వీవోఏల డిమాండ్స్

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనాలు అమలు చేయాలి. రూ.10 లక్షల సాధారణ ఆరోగ్య బీమా అందించాలి. ఆన్లైన్ పనులను రద్దు చేయాలి. సెర్ప్ నుంచి ఐడీకార్డులు యూనిఫామ్ ఇవ్వాలి. మహిళా సంఘాల సభ్యులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.

- సమ్మెలో వీవోఏలు
- సమ్మెకు కార్మిక సంఘాల మద్దతు
- నేడు చలో హైదరాబాద్

సమ్మెకు మద్దతు



న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. వారి సమస్యను పరిష్కరించే వరకు పోరాటం నిర్వహిస్తాం. ప్రభుత్వం వారిని గుర్తించి కనీస వేతనం ఉద్యోగ భద్రత ఇచ్చే వరకు జరిగే ప్రతి పోరాటానికి అండగా ఉంటాం. వీవోఏలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస గుర్తింపు ఇవ్వడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి సానుకూలంగా వ్యవహరించాలి. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతాం.

- గోపాలస్వామి సిఐటీయు రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి



వీవోఏలుగా పని చేస్తూ గ్రామాల్లో మహిళా సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు వారికి రుణాలు ఇప్పిస్తున్నాం. ఇన్ని చేస్తున్న మాకు గుర్తింపు లేదు. ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనం ఇవ్వాలి. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం.

- సుష్మ, వీవోఏ

న్యాయం జరిగే వరకూ పోరాడతాం



వీవోఏలుగా గ్రామాలలో అనేక రకాల పనులను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించడం లేదు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం నిర్వహిస్తాం. ప్రభుత్వాలను మేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాన్ని అమలు చేయమని అడుగుతున్నాం. మమ్మల్ని గుర్తించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నాం.

- అనిత, వీవోఏ

సీఈఓ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి


సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవ తెలంగాణ- గజ్వేల్

వీవోఏల సమస్యలు పరిష్కరించకపోతే సెర్ప్ కార్యాలయం ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను ఐక్యం చేస్తూ గ్రూపులను ఏర్పాటు చేస్తున్న వీవోఏలు కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. కేవలం రూ.3,900లతో నెలరోజులు గడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయల్లో ప్రతి నెలా జమ చేస్తున్న వీవోఏల కుటుంబాలు మాత్రం పస్తులతో గడుపుతున్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ సమావేశాలకు ఉపయోగించుకుంటున్న వారి కుటుంబాల గురించి ఎందుకు మా ఆలోచించడం లేదన్నారు. నిరసనలో భాగంగా వీఓఏలు వాంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకట చారి నికిత రుక్మిణి బిక్షపతి సౌకత్ రేణుక లక్ష్మీలత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2
సంగారెడ్డి
సోమవారం 29 మే 2023



నల్ల పోచమ్మ బ్రహ్మోత్సవాల్లో నీలం మధు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని కానుకుంట, అన్నారం గ్రామాల్లో నల్ల పోచమ్మ, కట్ట మైసమ్మ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. కాగా ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్యారాల మల్లేష్, ఎన్ శ్రీనివాస్, జింక గోపాల్, తుడుం శ్రీనివాస్, దర్గా బిక్షపతి, దేశబోయిన శ్రీనివాస్, బాలకృష్ణ, నరసింహ, చింత గుడ్డి రవి, జి శ్రీనివాస్ శ్రీనివాస్, వెంకటేష్, శంకర్, రొయ్యపల్లి బాలేష్, బిక్షపతి, అరుణ్, చింతకుట్టి సత్యనారాయణ, సిహెచ్ నాగరాజు, విజయ్, ఎండి రహిమాన్, సాజిత్, మోర యాదగిరి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఈనెల 31న న్యామతాబాద్ శివారులోని సన్‌రైజ్ ఫంక్షన్‌హాల్లో జరిగే బీఆర్ఎస్ రెండో విడత ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఎస్ఎస్వీ రెస్టారెంట్‌లో 19 గ్రామాల పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మున్నూరు రవీందర్, మండల ప్రజా ప్రతినిధులు పాండు రంగరావు పాటిల్, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, హద్నూర్ రాజ్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తుక్క రెడ్డి, రవికుమార్, గంగ్వార్ నిరంజన్ రెడ్డి, కుతుబోదిన్, దేవదాస్, పీటర్, చంద్రన్న, ఈశ్వర్, మహిపాల్, వినోద్, పూర్ణచందర్, ఇమ్రాన్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.



భర్తపై డీజిల్ పోసి నిప్పంటించిన భార్య



బాధితుడు నర్సింలు..

నవతెలంగాణ-జిన్నారం

నిద్రిస్తున్న భర్తపై భార్య డీజిల్ పోసి నిప్పంటించింది. బాధితుడికి తీవ్ర గాయాల వండతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన జిన్నారం మండలం ఊట్ల గ్రామపంచాయతీ పరిధిలోని దాదిగూడెం రామ్‌నగర్ కాలనీలో ఆదివారం జరిగింది. బాధితుడు సోదరుడు పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంకు నర్సింలుకు దిండిగల్ గ్రామానికి చెందిన యాదమ్మతో 17 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు అబ్బాయిలు కూడా ఉన్నారు. అయితే యాదమ్మ వివాహేతర సంబంధం పెట్టుకున్నదని తరచూ గొడవలు జరిగేవి. ఎంత నచ్చజెప్పినా ఆమె ప్రవర్తనలో మార్పు రావడం లేదని నర్సింలు తన సోదరుడు, కుటుంబ సభ్యులతో చెప్పుకునే వాడు. ఇదే విషయంపై మరోమారు ఈనెల 27న రాత్రి 9 గంటలకు యాదమ్మను నర్సింలు గట్టిగా అడగాడు. దీంతో అది మనసులో పెట్టుకున్న యాదమ్మ.. వారి ఇంటి ముందు ఆగి ఉన్న ఆటోలో నుంచి డీజిల్ తీసి ఇంట్లో నిద్రిస్తున్న భర్తపై పోసి నిప్పంటించి ంది. బాధితుడు ఒక్కసారిగా అరవడంతో.. చుట్టుపక్కన వారు అప్రమత్తమై 108 అంబులెన్స్ ద్వారా బాధితుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు జిన్నారం ఎస్సై విజయరావు తెలిపారు.

కాగా ఈ ఘనటలో నర్సింలు ఒళ్ళు తీవ్రంగా కాలిపోవడం, ఇంట్లో తను నిద్రిస్తున్న చోటు, ఇతరత్రాలు నిప్పంటుకున్న పరిస్థితులు హృదయ విదారకంగా కనిపించాయంటూ స్థానికులు వాపోయారు. ముగ్గురు పిల్లలు కలిగిన వీరి కుటుంబంలో ఇలాంటి దారుణ ఘటన చోటు చేసుకోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

అడ్మిషన్ల గాలం..

- ఇంటర్‌లో ప్రవేశాల కోసం కళాశాలల విస్తృత ప్రచారం
- తమ కళాశాలలో చేరాలంటూ ఫోన్‌కాల్స్
- పలనా గ్రూపులో చేరాలని ఉచిత సలహాలు..
- పీఆర్వోల అవతారమెత్తిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-జహీరాబాద్

పదో తరగతి పూర్తైన విద్యార్థులకు ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం కార్పోరేట్ కళాశాలు తమ పని మొదలెట్టేశాయి. ముందుగానే పాఠశాలల నుంచి ఫోన్ నెంబర్లు సేకరించిన పలు కళాశాలల నిర్వాహకులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. పలానా గ్రూపులో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని.. ఆ గ్రూపులో తమ కళాశాల విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని.. విద్యార్థులను తమ కళాశాలల్లోనే చేర్పించాలంటూ వారి తల్లిదండ్రులకు ఎర వేస్తున్నారు. రోజుకు ఒక్కసారైనా ఫోన్ చేసి.. తమ కళాశాలకు వచ్చి చూడాలని ఆహ్వానిస్తున్నారు. కార్పొరేట్ కళాశాల ల్లో ఇప్పుడైతేనే తక్కువ రేటుకు సీటు లభి స్తుందని, మున్ముం దు అసలు అడ్మిషన్లు కూడా దొరకడమే కష్టమవుతుందని వి ద్యార్థులు, వారి తల్లిదండ్రులును ఆందోళనకు గురి చేస్తున్నారు.

జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, జోగిపేట పట్టణాలలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమానులు ఇప్పటికే ప్రచారాలు ముమ్మరం చేశాయి. జహీరాబాద్ పట్టణంలో 8 ప్రయివేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాల యాజమాన్యాలు నియోజకవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి మండలల్లోని ఆయా గ్రామాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇంటింటికి తిరిగి ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

హెూరు భరించలేకపోతున్న తల్లిదండ్రులు..

జహీరాబాద్ కళశాలల కంటే హైద్రాబాద్, వివిద ప్రాంతాలకు చెందిన కార్పొరేట్ కళశాలల నిర్వహకులు ఇక్కడ ప్రచారం ఉధృతంగా చేస్తున్నారు. జిల్లాల వారీగా అడ్మిషన్ల కోసం సిబ్బందిని నియమించుకుని.. రోజువారీగా అడ్మిషన్ టార్గెట్లు పెడుతున్నారు. దీంతో వారు గ్రామీణ ప్రాంత విద్యార్థులే లక్ష్యంగా ఒకటికి రెండు సార్లు వారి ఇంటికి వెళ్లి.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అయోమయ పరిస్థితుల్లో నెట్టేస్తున్నారు. మీ విద్యార్థికి ఇందులో నైపుణ్యత ఉంది.. ఈ గ్రుపులో చేర్పించండి అంటు తికమక పెడుతున్నారని తలిదండ్రులు వాపోతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులే టార్గెట్...

కళాశాలల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌కాల్స్ చేయడం మొదలుపెట్టిన వ్యక్తులు ముందుగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులనే టార్గెట్ చేసుకుంటున్నారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అడ్మిషన్ల కోసం వల వేస్తు న్నారు. ప్రతి ఏటా వేసవికాలం ముగిసి, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేసరికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నుంచి మొదలుకుని ప్రైవేటు కళాశాల యాజమాన్యాల వరకు గ్రామాల్లో తిరగడం షరా మాములే.. కానీ కళాశాలల యాజమానులు తమ కళాశాలలో ఆ సౌకర్యాలున్నాయి అంటూ వారి చెవుల్లో ఊదరగొట్టి చివరకు వారితో ఒకే చెప్పిస్తున్నారు. ఫలితాలు రాగానే తమను సంప్రదించమని సందేశాలు పంపుతున్నారు. పదోతరగతి పూర్తయితే పిల్లలు ఎంపీసీనా, బైపిసినా ఎందులో చేరుతా రంటూ విద్యార్థులకు ఎర వేయడం మొదలు పెడుతున్నారు. ఇలా ఈ మూడు నెలల్లో సాగే ఈ తరహా వ్యాపారం రూ.లక్షలలో ఉంటుంది.



పీఆర్వోలుగా ఉపాధ్యాయులు

జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులే కళాశాలలకు పీఆర్వోలుగా పని చేస్తున్నారు. కళాశాలలకు తమ పాఠశాల నుంచి విద్యార్థుల బయోడేటాను అందించడం, వారి తల్లిదండ్రులకు ఫోన్‌లు చేయించడం వీరి పని. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కాబట్టి నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పలానా కళాశాలలో ఎడ్యుకేషన్ బాగుందని చెప్పి వారు ఒప్పందం కుదర్చుకున్న కళాశాలల్లో చేర్పిస్తారు. ఎంతమంది చేరితే అంత కమీషన్ తీసుకు ంటారు. వారిని చూసిన మరికొంత మంది ఉపాధ్యాయులు కూడాఇదో మంచి వ్యాపారమంటూ అదేబాటలో నడుస్తున్నారు.



42వ రోజుకు వీఓఏల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-జోగిపేట

సమస్య పరిష్కారం కోరుతూ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 42వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో కేవలం మూడు వేల తొమ్మిది వందల వేతనంతో వీవోఏలు పనిచేస్తున్నారని.. ఈ వేతనంతో వారి కుటుంబ పోషణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26000 అమలు చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏల మండలాధ్యక్షులు మల్లయ్య, వీఓఏలు విజయ, లక్ష్మి, సువర్ణ, కవిత, అనిత, రేణుక, మానస, ఎం అశోక్, చంద్రిక, అర్షియ, వీరమని, సునీత తదితరులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్ : మండలంలో 42వ రోజు నిరవధిక సమ్మె చేపట్టిన వీవోఏలు మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వీవోఏలకు కనీసం వేతనం రూ.26,000 చెల్లించాలని, రూ. 10.లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అభయహస్తం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. వీవోఏల మండలాధ్యక్షురాలు జీ.నాగరాణి, నాగేందర్, పి.శరణప్ప, బి లావణ్య, శబీర్ మీయ్యా, అల్లవెని, భిమన్న, సీహెచ్.లక్ష్మి, జ్యోతి, సుజత, యండి ఫాతిమా, నర్సింహారెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళ్లు

- అమీన్పూర్‌లో ఎన్టీఆర్ విగ్రహన్ని ఆవిష్కరించిన ఎమెల్యే జీఎంఆర్

నవతెలంగాణ-అమీన్‌పూర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు దివంగత నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అమీన్పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతి గొప్పతనాన్ని చాటిచెప్పిన మహెూన్నత నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తన నటనతో కోట్ల మంది ప్రేక్షకులను అభిమానులుగా మార్చుకోవడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వినూత్న పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ కులం మతం ప్రాంతం తేడా లేకుండా అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







జహీరాబాద్ : నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శతజయంతి సందర్భంగా ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఉగ్గెల్లి రాములు యాదవ్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నూటికో కోటికో ఒకరు ఎన్టీఆర్ లాగా కలకాలం ప్రజల మనసుల్లో మిగిలిపోతారన్నారు. వారి చరిత్ర గురించి బావితరాలు గర్వంగా చెప్పుకుంటాయ న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ మహ మ్మద్ తంజీం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్, కార్మిక సంఘం నాయకులు కృష్ణ, మహమ్మద్ ఖలీద్, ఇస్మా యిల్, మాజీ సర్పంచ్ జగదీష్, యాదవ సంఘం నాయ కుడు రాజా రమేష్ యాదవ్, టేకుమట్ల గణేష్ , లక్ష్మణ్ యాదవ్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జయప్రదం చేయండి

- కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ
- హక్కుల కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కండి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కిర్బీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జే మల్లికార్జున్



నవతెలంగాణ-పటాన్‌చెరు

రేపు(మంగళవారం) జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కిర్బీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జే మల్లికార్జున్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పాశమైలారంలో జరిగిన కిర్బీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం లో మల్లికార్జున్ మాట్లాడుతూ.. సీఐటీయూ ఏర్పడిన తర్వాతనే దేశంలో ఐక్య పోరాటాలు వచ్చాయని, కార్మికులు ఐక్యమయ్యారని ఆయన గుర్తు చేశారు. పాలకులు తెచ్చే కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయు అన్నారు. ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, విచ్ఛిన్నకర ఉద్య మాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడిందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ప్రైవేటు విధాననికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాడిన సంఘం సీఐటియు అన్నారు. రెండో లేబర్ కమిషన్ సిఫార్సులు, ప్రస్తుత మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం సీఐటీయూతోనే సాధ్యమన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. మతోన్మాదం ఉచ్చులో కార్మికులు పడకూడదని ఆయన కోరా రు. ఐక్య పోరాటం ద్వారానే ఏదైనా సాధించగలమన్నారు. ఈనెల 30న జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య, శాండ్విక్ యూనియన్ ఉపాధ్యక్షులు బి.పాండురంగారెడ్డి, యూనియన్ నాయకులు వీఎస్ రాజు, నాగప్రసాద్, లక్కన్, లక్ష్మణ్, రవీందర్, శీను, మహేశ్వర్‌రెడ్డి, చిట్టెన్న, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన కార్యశాల, ఫీల్డ్ విజిట్

నవతెలంగాణ-పటాన్‌చెరు

స్టార్టప్‌లు, వర్ధమాన పారిశ్రామికవేత్తలను సన్నద్ధం చేసే లక్ష్యంతో గీతం హైదరాబాద్‌లోని వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ (వీడీసీ) నిర్వహిస్తున్న ఆరు రోజుల 'సమ్మర్ స్టార్టప్ స్కూల్‌'లో భాగంగా 'డిజైన్ థింకింగ్ వర్క్ షాప్‌తో పాటు ఫారెస్ట్ ట్రయల్స్' పేరిట క్షేత్రస్థాయి పర్యటన ఆదివారం విజయవంతంగా ముగిశాయి. సమస్య పరిష్కారంతో పాటు నైపుణ్యాలు, ఆవిష్కరణ వ్యూహాలతో కూడిన ఈ వర్క్ షాప్ వీడీసీ సీనియర్ వెంచర్ కోచ్‌లు వాసుదేవ్ వంగర, యావిని రాపేటి నిర్వహించారు. క్షేత్ర పర్యటనను కూడా వారు పర్యవేక్షించారు. వ్యాపారం విజయవంతం కావాలంటే, వినియోగదారుల అవసరాలపై లోతైన అవగాహనను ఏర్పరచుకోవడం, సృజనాత్మకంగా యోచించడం వంటి మెళకువలను వారు వివరించారు. ఈ ప్రపంచ సంక్షోభానికి వినూత్న పరిష్కారాలను రూపొందిం చడానికి 'జీవవైవిధ్య నష్టం' అనే ఇతివృత్తంతో సమస్య-పరిష్కారానికి మానవ-కేంద్రీకృత విధానంపై ఈ కార్యశాల దృష్టి సారించడంతో పాటు స్టార్టప్ల విజయంలో దాని పాత్రను వివరిం చారు. సవాళ్లను సరికొత్త దృక్పథంతో ఎదుర్కోవడానికి, ఆవిష్క రణలు చేయడానికి, వినియోగదారులకు అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలు అందించడానికి ఈ కార్యశాలలో చేసిన మార్గదర్శనం తమకు ఎంతో తోడ్పడుతుందని ఇందులో పాల్గొన్న విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అలాగే క్షేత్ర పర్యటన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.



కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి కేకే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జయరాజ్ మాట్లాడుతూ.. అనేక కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వడ్లు కొనకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్రాలకు లారీలు రాక వందల సంఖ్యలో ట్రాక్టర్లు లైన్లలో ఉండి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రోజుకు రూ.2000 చొప్పున అదనంగా ట్రాక్టర్ కిరాయి రైతులపై పడుతున్నదన్నారు. ఒక్కో రైతు పైన వేల రూపాయల అదనపు భారం పడుతున్నదని ఆరోపించారు. ఇంకోపక్క ప్రకృతి వైపరీత్యం వల్ల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో రైతులు ఐదు నుంచి 10 రోజుల చొప్పున పడిగాపులు కాస్తున్నారన్నారు. ఈ విషయం పట్ల సంబంధిత అధికారులు, జిల్లా మంత్రులు కనీసం స్పందించడం లేదన్నారు. వెంటనే జిల్లా ఇన్చార్జి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ జోక్యం చేసుకొని అన్ని కొనుగోలు కేంద్రాలు పరిశీలించి.. లారీల తెప్పించి వెంటనే వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడక్కడ కొనుగోలు సిబ్బంది మిల్లర్లు కుమ్మకయ్యారన్నారు. వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనియెడల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులతో కలిసి జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, నాయకులుకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీకి పనిచేసినోళ్లకు గౌరవం దక్కడం లేదు

బీఆర్ఎస్ నాయకుడు వీరభద్రరావు

నవతెలంగాణ-వట్‌పల్లి

2018 ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ పార్టీకి పనిచేసి.. అభ్యర్థి గెలుపునకు కష్టపడినప్పటికీ గుర్తింపు లభించకపోవడంతో పాటు తగిన గౌరవం కూడా దక్కడం లేదని బీఆర్ఎస్ నాయకుడు నియోజకవర్గ స్థానిక నినాద ఆత్మ కమిటీ పోరాట నాయకుడు వీరభద్ర రావు ఆవేదన వ్యక్త చేశాడు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు పెద్దన్న స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అందోల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల ముందు స్థానిక అభ్యర్థి నినాదంతో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పర్యటిస్తూ స్థానిక అంశాన్ని బలంగా వినిపించడంతోనే ప్రస్తుత ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కు అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించిందన్నారు. దాంతో స్థానికేతరులను కాకుండా స్థానికుణ్ని గెలిపించుకొనెందుకు శాయశక్తులకు కృషి చేసినప్పటికీ.. గెలిచిన మూడు నెలల నాటి నుండి పార్టీకి కష్టపడ్డ వారికి గుర్తింపునివ్వకుండా ఇతర పార్టీల్లో ఉంటూ గెలుపును అడ్డుకున్న వారికి పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. పొమ్మన్న లేక పొగ పెట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మళ్లీ తెరపైకి ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పర్యటిస్తూ బీఆర్ఎస్ అసంతృప్తి నేతలను ఒక తాటి పైకి తెచ్చే సమాలోచనలు జరపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఏడది చివరిలో ఎన్నికలు జరగనున్నందున మళ్లీ ఆత్మ కమిటీ సమావేశాలను నిర్వహిస్తూ అవసరమైతే కమిటీ తీర్మానం మేరకు ఆత్మ కమిటీ ఆధ్వర్యంలోనే అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపేందుకు కూడా వెనుకాడేది లేదన్నారు. జూన్ మాసంలో నియోజకవర్గస్థాయిలో ఆత్మ కమిటీ స్థాయి సమావేశాన్ని నిర్వహించి కమిటీ సూచనలను పరిగణలోనికి తీసుకొని తదుపరి నిర్ణయాలను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పెద్దన్న, శ్రీను తదితరులున్నారు.

సింగూరు కాలువ పనుల్లో రూ.100 కోట్ల స్వాహా.. అవాస్తవం

- దామోదర్ పై ఎమ్మెల్యే చేసిన ఆరోపణల్లో నిజం లేదు
- మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు



నవతెలంగాణ-జోగిపేట

గత కాంగ్రెస్ హయాంలో సింగూర్ కాలువ నిర్మాణ పనుల్లో మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రూ. 100 కోట్లు స్వాహా చేశాడని స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అందోల్ జోగిపేట మున్సిపల్ 17 వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. ఆదివారం జోగిపేట లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో ప్రభుత్వం పనులు చేపట్టేందుకు రూ.89.99 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని ఇది గుర్తుంచుకోవాలన్నారు. అందోలు-జోగిపేట మున్సిపల్‌కు సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేసినా, ఇప్పటివరకు పనులను చేపట్టలేదన్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీగా ఏర్పాటై పదేండ్లు గడిచిందని, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా భవనం పనులు మాత్రం చేపట్టలేకపో యారన్నారు. ప్రస్తుతం పాలకవర్గ సమావేశాలన్ని పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో నిర్వహించుకొవడం దురదృష్టకరమన్నారు. లక్షలు ఖర్చు పెట్టి చేపడుతున్న ఆత్మీయ సమ్మేళనాలతో ఎన్నికల ప్రచారమే తప్పా, ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దామోదర్ కూతురు త్రిష పర్యట నను తట్టుకోలేక ఆమెపై అనవసరమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బీఆర్ఎస్ కార్యకర్తలకు, ఎమ్మెల్యే అనుచరులకు కేటాయించారని ఆరోపించారు. ఆసరా పథకం కింద ప్రభు త్వం అందించే పెన్షన్‌లు కొత్త వారికి రావడం లేదన్నారు. అందోలు నియోజకవర్గ అభివృద్ధి జరిగింది దామోదర్ హయాంలో నేనని, ప్రజలందరికి తెలుసునన్నారు. వచ్చే ఎన్నికల్లో దామోదర్ గెలుపు ఖాయమని, బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదన్నారు. ప్రజలు ఇచ్చే తీర్పుకు సిద్దంగా ఉండాలన్నారు.

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానకరం

నవతెలంగాణ-సంగారెడ్డి

నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానకరమైన విషయవని.. రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ప్రారంభోత్సవంలో ప్రతిపక్షాలకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, 19 పార్టీలు బాయ్ కాట్ చేసినా సరే అత్యంత దుర్మార్గంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వాన్ని వెనకాల నుంచి నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ దేశాన్ని మత రాజ్యాంగ మార్చేందుకు కుట్రలు చేస్తున్నాయని, అందుకే రాజ్యాంగాన్ని కూడా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పాత రాచరిక వ్యవస్థను తీసుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్దతిలో వారి విధానాలు ఉన్నాయన్నారు. అందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కర్ణాటకలో లాగా దేశం నుంచి కూడా బిజెపి తరిమేసే సమయం ఆసన్నమైందని, మతోన్మాద రాజకీయాలక మీదట సాగవని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానా లను ఎండగడుతూ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్త లకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పంతులమ్మ, రాజేష్, మల్లేశం, వీరేశం, రాజయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-సర్పాపూర్

మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన శేరిపల్లి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా.. శ్రీనివాస్ వైద్య ఖర్చు నిమిత్తం ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్, పత్రాల త్రినేష్ గౌడ్, నవీన్ శ్రీకాంత్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




నవతెలంగాణ
మెదక్
సోమవారం 29 మే 2023



ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో తెలంగాణ అభివృద్ధి

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షులు మహిపాల్ గౌడ్ అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశానుసారం గల్లీగల్లీ బీఆర్ఎస్వీ ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో భాగంగా 23, 24, 25 వార్డులలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనార్సు అధ్యక్షతన నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. 23వ వార్డు బీఆర్ఎస్వీ అధ్యక్షులుగా రాజబోయిన నవీన్, 24 వ వార్డు అధ్యక్షులుగా పల్లె బాలు గౌడ్, 25వ వార్డు అధ్యక్షులుగా వీరబత్తిని యశ్వంత్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు యోగి, అరవింద రెడ్డి, రాము, మిద్దె రవి, కడవెర్గు సాయి, సమన్వయ కర్త ఇరుగంటి రమేష్, రాగారం రాములు యాదవ్, కర్రోల సతీష్, మెరుగు మాధవ్, గోపి, సతీష్ , బింగి విజయ్, అశోక్, మహేష్, ఆదర్శ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కవి సురవరం ఆదర్శప్రాయులు



నవ తెలంగాణ - సిద్దిపేట

గోలకొండ కవుల సంచిక ద్వారా 350 మంది తెలంగాణ కవుల జీవిత చరిత్రను ప్రచురించి, తెలంగాణ కవులను జగతికి పరిచయం చేసిన ఆదర్శప్రాయులు సురవరం ప్రతాపరెడ్డి అని బాల సాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో కవులతో కలసి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాత్రికేయులుగా, సంఘ సేవకులుగా, రచయితగా సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలు అమోఘమన్నారు. సురవరం రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని, గ్రంథాలయాల ఏర్పాటులో కూడా సురవరం ప్రతాపరెడ్డి ముందునడిచి ప్రజల మధ్య నిలిచిన గొప్ప రచయితని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు శ్రీచరణ్ సాయిదాస్, కేసుగారి రాములు, తిరుపతి పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన మహిళ కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి



నవతెలంగాణ- కొల్చారం

కొల్చారం మండలం అప్పాజీ పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల నర్సింలు గృహప్రవేశ వేడుకలు ఆదివారం నిర్వహించుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై నూతన నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన గృహంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట సర్పంచ్ చలం రూప్సీ లక్ష్మీ యాదగిరి, గౌడ సంఘం మండల అధ్యక్షులు వెంకట్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం సంతోష్ కుమార్, మాజీ ఎంపీటీసీ చిట్యాల యాదయ్య, ధన్ రాజ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

వధువుకు పుస్తె మట్టెలు అందజేసిన సర్పంచ్



నవ తెలంగాణ-చేగుంట

చేగుంట మండలం చిన్న శివనూర్ గ్రామంలో పేదింటి ఆడబిడ్డ పుట్ట నాగమణి కూతురు గాయత్రి పెళ్లికి గ్రామ సర్పంచ్ కొటారి అశోక్ ఆదివారం పుస్తె మట్టెలు నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంంలో ఇప్పటివరకు ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశానన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నానని, గ్రామంలో ఎవ్వరికి ఆపద వచ్చినా గ్రామ ప్రజల వెన్నంటి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-టేక్మాల్

మండలంలోని తంపులూరు గ్రామానికి చెందిన పోతరాజు లింగం గత కొద్ది సంవత్సరాలుగా న్యూస్ ఇండియా పత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు. గత వారం రోజుల క్రితం అనారోగ్యం పాలై హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌లో ఆరోగ్యం విషమించడంతో లింగం మృతి చెందాడు. అంత్యక్రియలు స్వగ్రామం తంప్లూర్లో జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల చదువుకు సహాయం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ భాస్కర్ మహేందర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ- కొల్చారం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం అప్పాజీ పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కన్నెబోయిన వెంకటేశం (30) దుంపల కుంటలోని బాలాజీ ఇండస్ట్రీస్‌కు ఐకెపిలో భాగంగా ధాన్యం విక్రయించేందుకు తీసుకెళ్లాడు. అయితే ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడడంతో వడ్ల లారీపై ధాన్యం తడవకుండా ఉండేందుకు టర్పాలిన్ కప్పేందుకు ఈ నెల 21న ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో పోతంశెట్టిపల్లి శివారులోకి వెళ్ళగానే రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్టు ఈదురు గాలులకు విరిగి అతనిపై పడింది. దీంతో వెంకటేశం తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న వెంకటేశం పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య అనసూయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నాగసబోయిన పొట్రాజ్ యాదవ్ ఇటీవల మృతి చెందడంతో మృతుని కుటుంబాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ పరామర్శించి మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్ కు పొట్రాజ్ యాదవ్ అత్యంత ఆప్తుడు అని ఆయన తెలిపారు. ఆయన మృతి ఆయన కుటుంబానికి తీరని లోటు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుద్దేల విజయ్, పోల్ రాజ్ శ్రీనివాస్ గోలి కనకయ్య, కనకాచారి, సుమన్, రాజు, సంతు, రవీందర్, నాగబాయిన కృష్ణమూర్తి, నాగబాయిన రాజు, సిలివెరు ఏల్లయ్య, నాగబాయిన ఏల్లయ్య, రజినీకాంత్, చింతల వేణు, గుండె రాజు, ఉదయ్, గుండె అజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు

దళిత గిరిజన ఓట్ల కోసమే ద్రౌపతి ముర్ముకు రాష్ట్రపతి పదవి



నవ తెలంగాణ -గజ్వేల్

దళిత గిరిజన ఓట్లు కోసమే ద్రౌపతి ముర్ముకు రాష్ట్రపతి పదవి కట్టబెట్టారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎం.ఎస్.పి రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ ఇంచార్జి ఆంజనేయులు మాదిగ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లో లేని సమయంలో అంటరానితనం రాజ్యమేలుతున్న ఆ సందర్భంలో చరిత్రలో లికించబడిన పాత పార్లమెంట్ భవనంలోనికి రాజ్యాంగ సృష్టి కర్త విశ్వరత్న అంబేద్కర్‌ను గౌరవంగా పిలిచి మొదటి వరసలో కూర్చోబెడితే... ప్రస్తుతం ప్రథమ పౌరులను మోడీ అవమానపరిచినట్లు పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమల్లో ఉండి కులవివక్షను నిషేధించిన ఈ సమయంలో దళిత-గిరిజనురాలు అనే ఏకైక కులవివక్షతో భారత దేశానికే ప్రథమ పౌరురాలు ద్రౌపతి ముర్మును ముఖ్య అతిథిగా కాదు కదా.... కనీసం ఆమెకు ఆహ్వానం పంపలేదన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎలాంటి హెూదా లేని గుళ్ల గోపురాలకు పరిమితమయ్యే అగ్రవర్ణ పీటాధిపతులను పిలిచి రాజ్యాంగాన్ని కాకుండా దళిత-గిరిజన పీడితులను, మహిళలను అవమాన పరిచిన బిజెపి ప్రభుత్వాన్ని దళితులు కూల్చాలన్నారు. బిజెపి ప్రభుత్వంపై, ఈ చర్యకు సూత్రదారి పాత్రదారి అయిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పొట్ట కర్నాకర్, బుర్కి ప్రశాంత్, స్వామి, శ్రీకాంత్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతల ధర్నా

- రైతులకు అండగా టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్
- కిలోమీటర్ పొడవునా నిలిచిన వాహనాలు



నవ తెలంగాణ-నర్సాపూర్

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడానికి లారీల కొరత తీర్చాలని. ధాన్యం కొనుగోలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ చౌరస్తాలో నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర నాయకులు అంజనేయులు గౌడ్, మండల ఉపసర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు అశోక్ గౌడ్, మంతూర్ మాజీ ఉపసర్పంచ్ యాదవ్ గౌడ్ తదితరులు రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎస్సై 2 శ్రీనివాస్ తన సిబ్బందితో వచ్చి సముదాయించినా రైతులు వినకుండా భీష్మించుకుని కూర్చున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర నాయకులు అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ రైతు వ్యవసాయాన్ని నమ్ముకొని కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకోవడానికి అన్నదాతలు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల తరబడి కల్లాలు వద్దనే ధాన్యం ఉన్న రైతును పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద మూడు కిలోలు తరుగు తీస్తుండగా అదేవిధంగా మళ్ళీ రైస్ మిల్లుల వద్ద కూడా తరుగు మిల్లర్లు తీయడం ఎంతవరకు సమంజసమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి అన్నదాతలు పడుతున్న కష్టాలను గమనించి కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన లారీలను తరలించి ధాన్యాన్ని సేకరించాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆర్డీఓ కార్యాలయాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని ఆంజనేయులు గౌడ్ హెచ్చరించారు. ఈ ధర్నాలో మండల తహసీల్దార్ ఆంజనేయులు, జిల్లా అదనపు కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు లారీలను తరలించి ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతేగాక సమీపంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యంతో మాట్లాడి కొనుగోలు చేయాలని కోరడంతో ఈ ధర్నా సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్, ఎంపిటిసి అశోక్, మండల ఉపసర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు అశోక్ గౌడ్, మంతూర్ మాజీ ఉప సర్పంచ్ యాదవ్ గౌడ్, మన్నె గణేష్ ,దశరథ గౌడ్, నాయి బ్రాహ్మణ జిల్లా ఉప అధ్యక్షుడు చంద్రమోహన్, దశరథ గౌడ్, కట్ట రాములు ,సోమన్న నర్సాగౌడ్, అందానగరం రాములు,, నాగరాజు గౌడ్, వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో బీఆర్ఎస్ పార్టీ కమిటీల నియామకం



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ చిందం సబిత రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు అధ్యక్షతన పలు కమిటీల నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షునిగా టి. శేఖర్, గ్రామ సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా ఎల్లబోయిన సురేష్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షునిగా అబ్దుల్ వాహెద్, ఎస్సీ కమిటీ అధ్యక్షునిగా దొబ్బల అంబరీష, యూత్ కమిటీ అధ్యక్షునిగా ఎండి నాసిర్, గ్రామ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా దొబ్బల లక్ష్మి, రైతు కమిటీ అధ్యక్షునిగా పల్లి ఎల్లయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సబిత మండల అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో దేశానికే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఖ్యాతిని పొందుతుందని, బలహీన బడుగు వర్గాల, మహిళల కోసం ఎక్కడా లేని విధంగా పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లి వివరించాలని సూచించారు. గత ఉప ఎన్నికలలో వల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఇతర పార్టీలకంటే అధికంగానే ఓట్లు పడ్డాయని, రాబోయే ఎన్నికలలో గతంలో కంటే ఎక్కువగా ఓట్లు పడే విధంగా ప్రతి కమిటీ సభ్యుడు, కార్యకర్తలు పాటుపడాలని, దుబ్బాకలో పార్టీ జెండా ఎగుర వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, మండల అధ్యక్షునితో పాటు మాజీ సొసైటీ చైర్మన్ తౌర్యా నాయక్, వల్లూరు గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ రాములు, పార్టీ సీనియర్ నాయకులు నీలకంఠం, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల : మండల పరిధిలోని నాగపురి గ్రామానికి చెందిన నిరుపేద బండకింది వెంకటేశం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి భాధితున్ని పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తదుపరి చికిత్సకు అవసర మయ్యే ఖర్చును అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండమీది సంతోషి- కరుణాకర్, మాజీ సర్పంచ్ డబ్బా లింగం, గూడెపు మహేష్,బండకింది బిక్షపతి,బన్నీ,వేణు,ఉదయ్, రాజు,బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్తికావస్తున్న గజ్వేల్ రింగ్ రోడ్డు

- కొత్తవారు ఆగి అడగాల్సిందే
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డును రూ.240 కోట్లతో పూర్తి చేస్తున్నారు. ఒకటి రెండు చోట్ల పనులు మిగిలినప్పటికీ మిగతా రోడ్డు పూర్తి చేసుకుని వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజ్ఞాపూర్‌లో ఉన్న పీవీ నరసింహారావు ప్రోకటెన్సీ కళాశాల, శ్రీగిరిపల్లి, పాతూరు చౌరస్తా, వాగ్గడ్డ హనుమాన్, ముత్రాజ్పల్లి, కోమటి బండ, పాత ఆర్డీఓ కార్యాలయం, సంగుపల్లి తదితర రింగ్ రోడ్డు సర్కిల్ ఏర్పాటు చేశారు. అవి ఇరు ప్రాంతాల ప్రయాణికులు అక్కడికి రాగానే కొంత అయోమయానికి గురవుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు సూచిక బోర్డులు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో కొంత ఇబ్బందులు ఉన్నాయి. చాలా చోట్ల హరిత గజ్వేల్ గా బోర్డులు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో హరితహారంగా పచ్చని చెట్లతో పూర్తిస్థాయి బీటీ ఏర్పాటు చేసుకొని రింగురోడ్డు సిద్ధంగా ఉంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ తో పాటు ఇతర ప్రాంతాల చెందిన ప్రజలు బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి తిరిగి వస్తే మేము గజ్వేల్కే వచ్చామా? అని అడిగి తెలుసుకుంటున్నారు. రింగ్ రోడ్డు దృశ్యం పలువురుని ఆకట్టుకుంటుంది. పలు దిక్కుల పచ్చని చెట్లతో గ్రాస్ గడ్డితో రింగురోడును ముస్తాబు చేశారు. ఒక్కసారి పాతవారు కూడా అయోమయానికి గురవుతున్నారు. సూచిక బోర్డు లు ఏర్పాటు చేయాలి. మొత్తం 24 కిలోమీటర్లు రింగ్ రోడ్డు పనులగాను 23 కిలోమీటర్లు రింగ్ రోడ్డు పూర్తి చేశారు. సంగాపూర్ రోడ్డులో 150 మీటర్ల రోడ్డు నిర్మించే ఉంది. ఈ భూమి కోర్టులో ఉంది. జూన్ చివరిలోగా పూర్తి తీర్పు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు..ధర్మారెడ్డి పల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే బ్రాడ్ వద్ద కిలోమీటర్ నర పైగా పనులు చేయవలసింది. ఆ పనులను రైల్వే శాఖ అధికారులు పూర్తి చేస్తే రింగ్ రోడ్డు పూర్తి అందుబాటులోకి వస్తుంది. కానీ రైల్వే శాఖ అధికారులు స్పందించినట్లు కనిపిం చడం లేదు.. రైల్వే బ్రిడ్జి పెండింగ్ ఉన్నది. వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో మంత్రి హరీష్ రావు మాట్లాడారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు కొత్త హంగులను రూపుదిద్దుకుంటుంది.. ఈ ప్రాంతంలో వ్యాపార వాణిజ్య రంగాల అభివృద్ధికి మైలురాయిగా మారనున్న ఈ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.250 కోట్లు నిధులను మంజూరు చేసి మొత్తం 24 కిలోమీటర్ల రింగ్ రోడ్డును చేస్తారు. ఇప్పటివరకు 22 కిలోమీటర్ల రింగ్ రోడ్డు పూర్తయింది. 15 కిలోమీటర్ల రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించి, కొన్ని చోట్ల ఆరు లైన్లు పూర్తి చేశారు.. ముఖ్యమం త్రి కేసీఆర్ తో పాటు మంత్రి హరీష్ రావు సింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు ఆరాధిస్తున్నా రు. గతంలోనే రూ.220 కోట్లతో పనులు జరిగాయి.అందులో సగం పైగా నిధులను వెచ్చించినప్పటికీ పాత పనులు. పూర్తి రద్దుచేసి రూ 118 కోట్ల రూపాయలతో కొత్త టెండర్ను తిరిగి ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా వద్ద రిమ్మనగూడ వద్ద జగదేవ్పూర్ రోడ్డు వైపున అప్రోచ్ రోడ్లతో పూర్తి చేయడానికి నిర్ణయించారు.%శ్రీ% అంతేకాకుండా 22 కిలోమీటర్లు రోడ్డుపై మరో లేయర్ బీటీ వేశారు. అంతే రాకుండా రింగు రోడ్ పైన బయ్యారం, క్యాసారం గ్రామానికి వెళ్లే మార్గాల వద్ద నిర్మించుకున్న అండర్ పాస్ లు క్యాసారం వాగు వద్ద బరి చెరువు వద్ద నిర్మించుకున్న బ్రిడ్జిలకు అధికారులు స్వల్ప మార్పులు చేసి పనులు పూర్తి చేశారు.

ప్రజ్ఞాపూర్‌లో తగ్గిన బిజినెస్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు మూలంగా రాజీవ్ రహదారిపై ఉన్న ప్రజ్ఞాపూర్ లో అన్ని వ్యాపార రంగాలపై రింగ్ రోడ్డు ప్రభావం చూపింది. పాతూరు చౌరస్తా నుండి పీవీ నరసింహారావు ప్రోకడసి కళాశాల వరకు నేరుగా ప్రజ్ఞాపూర్ మీదుగా రోడ్డు వెడల్పు చేస్తామంటే స్థానిక వ్యాపారులు వ్యతిరేకించారు. ఇల్లు కోల్పోతామని వ్యాపారం నష్టపోతుందని అధికారులతో మొరపెట్టుకున్నారు. దీంతో పాతూరు చౌరస్తా నుండి శ్రీగిరిపల్లి మీదుగా పివి నరసింహారావు ప్రోకడెన్సి కళాశాల వరకు హైవే బ్రిడ్జి నిర్మించారు. వాహనాలు, ద్విచక్ర వాహనాలు, హైవే రోడ్డుపై వెళుతున్నాయి. చిరు వ్యాపారాలు, పెద్ద వ్యాపారులకు భారీగా నష్టపోతున్నారు. గతంలో వాహనాలు ప్రజ్ఞాపూర్ మీద వెళ్తూ టిఫిన్స్, చిన్నాచితక వ్యాపారుల జోరుగా వ్యాపారం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పాలి. రానున్న కాలంలో పాతూరు చౌరస్తా, రిమ్మనగూడ గ్రామాలు వ్యాపార కేంద్రంగా మారే అవకాశం ఉంది.

జూన్‌లో పూర్తి

గజ్వేల్ పాత ఆర్డీవో కార్యాలయం వద్ద 150 మీటర్ల రోడ్డు వివాదం కోర్టు పరిధిలో ఉంది. జూన్ చివరి వారంలోగా తీర్పు వచ్చే అవకాశం ఉంది. రైల్వే బ్రిడ్జి వద్ద 1600 మీటర్ల రోడ్డు పనులు మిగిలి ఉన్నాయి. రైల్వే శాఖ అధికారులు పనులు పూర్తి చేసిన తర్వాత మిగతా రోడ్డు పనులు పూర్తి చేశాం.

- రామకృష్ణారెడ్డి, గజ్వేల్ రింగ్ రోడ్ ప్రత్యేక అధికారి

బూతుస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



నవ తెలంగాణ- గజ్వేల్

బూతుస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని, నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పన్నులను ప్రజలోకి తీసుకెళ్లాలని, రానున్న ఎన్నికల్లో గజ్వేల్ గడ్డపై బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని బిజెపి రాష్ట్ర నాయకులు ఏ ల్లు రాంరెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి సెల్ కన్వీనర్ వెంకటరమణ , జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నలగామ శ్రీనివాస్,. రాష్ట్ర నాయకులు ధారం గురువరెడ్డి, బిజెపి నాయకులు అశోక్ గౌడ్, గజ్వేల్ అసెంబ్లీ కో కన్వీనర్లు మహేష్. సురేస్ మండల ప్రధానకార్యదర్శి వంజరి రాజు మండల మహిళ మోర్చ అధ్యక్షురాలు స్వాతి బిజెవైయం నాయుకులు మనోహర్ యాదవ్ ఇప్ప స్వామి మణి శేఖర్ బిజెపి మండల ఉపాధ్యక్షులు ప్రవీణ్. నవీన్ రామకంత్ నాయకులు శివ సతీష్ వెంకట్రామిరెడ్డి .ఆనంద్ సాయి గౌడ్. బాలగౌడ.వీనోద్ ఆర్ కే యాదవ్ కూమర్ .స్వామి .కరుణాకర్.మల్లేశం.రవి .సుధకర్. నర్సింలు ప్రబాకర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం



నవ తెలంగాణ - సిద్దిపేట

వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా వైశ్య భవనం గోశాలలో గోసేవ, యెలుగూరి మల్లికార్జున్ పుట్టినరోజు సందర్భంగా పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేసినట్లు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి ఇప్పటి వరకు పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో దాదాపు 45 వ అన్నదానం నిర్వహించామని అన్నారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు చింతా రాజేంద్రప్రసాద్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, వాసవి వనిత క్లబ్ కోశాధికారి తిమిశెట్టి విజయలక్ష్మి, వాసవి క్లబ్ పి ఆర్ ఓ అయిత శంకర్, వాసవి వనిత క్లబ్ పిఆర్ఓ మాంకాళ సుప్రియ, తొడుపునూరి రమేష్, చందిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బుక్క శివ పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలింపు



నవ తెలంగాణ - పటాన్ చెరు

పటాన్‌చెరు పట్టణంలోని మార్కెట్ లో బయటికి వచ్చి తిరిగి తన ఇంటికి వెళ్తున్న చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పటాన్ చెరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు పట్టణంలోని కటిక బస్తిలో నివసిస్తున్న అజీప్ కురిషి కుమార్తె చిన్నారి మాహీరా (6) శనివారం రాత్రి 10 గంటల సమయంలో బయటికి వచ్చి తిరిగి ఇంటికి వెళు తున్న గా ఒక్కసారిగా కుక్కలు కింద పడవేసి తీవ్రంగా గాయపరిచాయి. రక్త గాయాలతో విలవిల ఆడుతున్న చిన్నారిని చూసి చుట్టుపక్కల వారు కుక్కలను చెదరగొట్టారు. సమాచారం అందుకున్న చిన్నారి తల్లి దండ్రులు తీవ్ర గాయాలతో వున్న చిన్నారిని పట్టణంలోని స్థానిక ఏరియా ఆసుపత్రి కి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని నారాయణగూడ లో గల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్కల దాడితో ఒక్కసారిగా పారిశ్రామిక వాడ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.

నవతెలంగాణ 4
సిద్దిపేట
సోమవారం 29 మే 2023



దుద్దెడలో సాధనాసూరుల కళా ప్రదర్శన



నవ తెలంగాణ కొండపాక

సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సాధనాసూరులు కళా ప్రదర్శనతో దుద్దెడ గ్రామంలో ఆకట్టుకున్నారు. శంభు దేవాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ప్రదర్శనలో కనికట్టు విద్యను ప్రదర్శించి అలరించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన గంజి సింహాద్రి బృందం పలు రకాల ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. అనాదిగా వంశపారంపర్యంగా వస్తున్న కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్నామని సింహాద్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడు బొజ్జ మహదేవ్, తాజా మాజీ అధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, బింగి భాస్కర్, చిలగాని శ్రీనివాస్, వడ్లకొండ శ్రీహరి పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



నవ తెలంగాణ-మద్దూరు

సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి మద్దూరు పోలీసులు సెల్‌ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన గుండెగోని శ్రీకాంత్ అనే వ్యక్తి ఈనెల 24న సాయంత్రం సిద్దిపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా చేర్యాల మండలం గురజాగుంట వద్ద తన మొబైల్ పడిపోయినట్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిఈఆర్ఐ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ గుర్తించి బాధితుడు శ్రీకాంత్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మద్దూరు దూల్మిట్ట మండల పరిధిలోని ప్రజలు ఎవరిదైనా సెల్ ఫోన్ పోయిన వెంటనే మద్దూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మనిషి మనుగడకు నడక ముఖ్యం

- ఆరోగ్యంపై గంట సమయం కేటాయించాలి
- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతారెడ్డి





నవతెలంగాణ-నంగునూరు

మనిషి మనుగడకు నడక ముఖ్యమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతారెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో రాజగోపాలపేట పోలీసువారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసులో భాగంగా ఫ్రెండ్లీ 5కె రన్ నిర్వహించారు. 5కె రన్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ రాజుగౌడ్ అధ్యక్షతన బహుమతుల ప్రదానోత్సవంలో పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతారెడ్డి మాట్లాడుతూ పక్షులు, జంతువులు ఎప్పుడూ ఒక దగ్గర నిలకడగా ఉండవని, ఎగురుతూ, ఆడుతూ, పాడుతూ ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. మనిషి కూడా ప్రతి రోజు ఆడుతూ, పాడుతూ, వాకింగ్, రన్నింగ్, యోగా చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. మనం తీసుకునే ఆహారం కూడా చాలా ముఖ్యమని తెలిపారు. నడక వల్ల బీపీ, షుగర్, థైరాయిడ్ కంట్రోల్‌లో ఉంటుందని, ఉదయం, సాయంత్రం, సమయం దొరికినప్పుడల్లా, చిన్న చిన్న దుకాణాలకు వెళ్లేటప్పుడు మోటార్ సైకిల్‌పై కాకుండా నడుచుకుంటా వెళ్లి తెచ్చుకోవాలని సూచించారు. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి నడుచుకుంటూ, పాక్కుంటూ వెళ్తాయని మనిషి మాత్రమే కూర్చున్న చోటు నుంచి కదలకుండా ఉంటాడని తెలిపారు. ప్రతి ఆదివారం ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో 5కె రన్ నిర్వహిస్తామన్నారు. 5కె రన్‌లో గెలిచిన వారికి సీపీ శ్వేతారెడ్డి బహుమతులు అందజేశారు. నంగునూరు గ్రామ సర్పంచ్ చౌడుచెర్ల మమతా జయపాల్ రెడ్డి సీసీ కెమెరాలకు రూ.ఒక లక్ష చెక్కును సీపీకి అందించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉద్దేశంతో మంత్రి హరీష్ రావు స్ఫూర్తితో టిఫిన్ చేసే ప్రతి చోట స్టీల్ ప్లేట్లు, గ్లాసులనే వాడారు. 5కె రన్ లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్. మహేందర్,జడ్పీటీసీ తడిసిన ఉమా, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటి రైతు ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి,సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కోల మహేందర్ గౌడ్, వేముల వెంకట్ రెడ్డి, కర్ణకంటి వేణు, బెదురు తిరుపతి, స్థానిక మండల ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, రూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, త్రీటౌన్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్, రాజగోపాల పేట ఎస్ఐ ఎల్. రాజు గౌడ్, సిద్దిపేట రూరల్ ఎస్ఐ కిరణ్ రెడ్డి, చిన్నకోడూరు ఎస్ఐ శివానందం, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా యువకుల చేరికలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని అంతక పేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ,రూ. 500 కే సిలిండర్ అందిస్తామని అన్నారు. అలాగే మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 20 మంది యువకులు పార్టీలో జాయిన్ అయ్యారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన మకిలి బిక్షపతి కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ ఆదివారం రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఇటీవల మకిలి రేణుక చనిపోవడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు సమాచారం ఇవ్వడంతో నిరుపేద దళిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. నిరుపేద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బచ్చల సాయి మల్లు, ఉప సర్పంచ్ నరసయ్య, బచ్చల పరశురాములు, మకిలి కనకయ్య, మాజీ సర్పంచ్ టి రాజనర్సు,వి బాబు, బి రమేష్, వి శ్రీకాంత్, .మహేష్, చంద్రకుమార్ ,చింతల వేణు, గుండె రాజు, ఉదయ్ కుమార్, అజయ్ హేమంత్, బాబు తదితరులు పాల్గొన్నారు

చలో కరీంనగర్ విజయవంతం

జిల్లా పూసల సంఘం ఉపాధ్యక్షుడు ముద్ర కొల్ల యాదగిరి



నవ తెలంగాణ-దౌల్తాబాద్

పూసల సమస్యలను పరిష్కారం కోసం కరీంనగర్‌లో తలపెట్టిన సమర శంఖారావంకు జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలను సమీకరణ చేయడం జరిగిందని జిల్లా ఉపాధ్యక్షులు ముద్రకొల్ల యాదగిరి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూసల సమస్యలను పరిష్కారం చేయడం కోసం చేపట్టిన చలో కరీంనగర్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అన్ని కులాల మాదిరిగానే పూసల కులాల సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేంతవరకు పోరాడుతామన్నారు. అదే మాదిరిగా పూసల కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోనేటి సత్తయ్య, హరీష్, నరేష్, చంద్రశేఖర్, భాను ప్రసాద్, వరుణ్ తేజ్, కావేటి ప్రశాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని నాగపురి గ్రామంలో డిఎంఎఫ్టి నిధులు రూ.13.60 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన అంగన్వాడి భవనానికి ఆదివారం సర్పంచ్ బండమీది సంతోషి-కరుణాకర్‌తో కలిసి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సత్యనారాయణ, నర్సింలు, వెంకటేశం, స్వరూప-కృష్ణమూర్తి, కర్ణాకర్ అంగన్వాడీ టీచర్లు రాధ, వెంకటలక్ష్మి, కనకమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ వద్ద భక్తుల సందడి





నవతెలంగాణ-జగదేవపూర్

మండలం పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండపోచమ్మ అమ్మవారి వద్ద ఆదివారం భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వేసవి సెలవులు కావడంతో ఆదివారం అమ్మవారి వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు. పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ తగిన సౌకర్యాలు కల్పించి పరిశుభ్రత పాటించాలని కోరుతున్నారు

కేసీఆర్ కలలు గన్న తెలంగాణ కోసం కష్టపడాలి



నవతెలంగాణ-జగదేవపూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పనగట్ల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ రెండవ తేదీ నుంచి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పురస్కరించుకొని నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ శాఖ అధ్యక్షులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి తీరును ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి 2014 తర్వాత తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు , రైతులకు తెలపాలన్నారు. రైతుల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించాలని తెలియజేశారు. రైతుబంధు ,రైతు బీమా, రైతులకు అందిస్తున్న పథకాలపై అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ,మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ సీఎం సహాయనిధి ఇలా రాష్ట్రంలో ప్రజలకు అందుతున్నటువంటి సంక్షేమ ఫలాలపై తెలియజేయాల్సిన అవసరం ప్రతి గ్రామ కమిటీ అధ్యక్షునికి, ప్రతి కార్యకర్తకు ఉందని గుర్తు చేశారు.

యువత ముందుండి బీఆర్ఎస్ పార్టీ బలోపేతం చేయాలి



నవతెలంగాణ-తొగుట

యువత ముందుండి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రైతు బంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్‌లు సూచించారు. ఆదివారం మండలంలోని గణపూర్ గ్రామంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా, కమిటీలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశానుసారం నూతన కమిటీలను ఎంపిక చేశామన్నారు. యువకులు పార్టీ బలోపేతానికి క్రియాశీలకంగా పని సూచించారు. బీఆర్ఎస్ యూత్ కమిటీ అధ్యక్షులుగా డి.భాను, ఉపాధ్యక్షులుగా నిఖిల్, రమేష్, విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షులుగా నవీన్, సోషల్ మీడియా అధ్యక్షులుగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభాల వెంకట మ్మ,టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కుంబల శ్రీనివాస్, బూత్ కమిటీ అధ్యక్షులు గణేష్, మల్లేశం గౌడ్, మండల కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ నాయకులు, రామస్వామి, మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు చింత బైరా రెడ్డి, యువ సీనియర్ నాయకులు నంట పరమేశ్వర్ రెడ్డి, అనిల్, రమేష్ గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, బోయిని బాలరాజు, ప్రశాంత్, వేముల యాదగిరి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను సస్పెండ్ చేయాలి

నవ తెలంగాణ-సిద్దిపేట : ప్రభుత్వ పర్మిషన్‌లు ఇవ్వకున్నా జిల్లాకు అనేక కార్పొరేట్ స్కూల్స్ వచ్చాయని, వాటిని పట్టించుకోని డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్, జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్‌లు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనుమతులు లేని పాఠశాలలు సిద్దిపేటలో వెలుస్తున్నాయని, విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్యపెట్టే విధంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇలాంటి పాఠశాలలపై పలుమార్లు డీఈవో శ్రీనివాస్ రెడ్డికి కంప్లైయింట్ చేసినా పట్టించుకోలేదన్నారు. డబ్బులకు అమ్ముడు పోయే అధికారులు విద్యావ్యవస్థను పూర్తిగా కార్పొరేట్‌గా మారుస్తున్నారన్నారు. వెంటనే ఇలాంటి డీఈవోని సస్పెండ్ చేయాలని జిల్లా ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు.

క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతూ యువతి మృతి



నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని గువ్వలేగి గ్రామానికి చెందిన కాశమైన తారవ్వ నాగులు దంపతుల రెండవ కుమార్తె కాశమైన సుదియా (కీర్తన) (18) గత కొంతకాలంగా కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఎకర ఇరవై గంటల వ్యవసాయ సాగు పొలాన్ని అమ్మి గతంలో కీర్తనకు వైద్యం చేయించారు. యువతి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరు ప్రజలకు చెప్పాలి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్ : మెదక్ ఎంపీ ఆదేశానుసారం అక్బరుపేట్ భూంపల్లి మండలం నగరం గ్రామంలో, బీఆర్ ఎస్వీ,యువత, సోషల్ మీడియా, కమిటీల నిర్వహణ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఇందులో భాగంగా నగరం గ్రామ బీఆర్ ఎస్ యువత అధ్యక్షుడిగా బైరి నరేష్, బీఆర్ ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడిగా సందా నరేష్ , విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బైరి నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్ మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సీఎం చొరవతో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఒక అబద్ధపు ఒక బూటకపు గ్లోబల్ ప్రచారాలను చేస్తూన్న బీజేపీని నాయకులను ఎప్పటికప్పుడు అడ్డుపడి నిలదీయాలని యువతకు విద్యార్థులకు హితవు పలికారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటింటికి ప్రతి గడపకు, తండాకు బాధ్యతాయుతంగా యువత చేరవేయాలని సూచించారు. మూడో సారి బీఆర్ఎస్ సర్కార్ రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఇంఛార్జీలు పడాల రాజు, అభిలాశ్ రావ్, గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, ఆత్మ కమిటి డైరెక్టర్ జీడీపల్లి, కిషన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, చందా సిద్దిరాములు, కూడవెల్లి దేవాలయం డైరెక్టర్ ఎల్కాపల్లి స్వామి, సీనియర్ నాయకులు,యాదా గౌడ్,జీడిపల్లి శ్రీనివాస్, జీడిపల్లి సురేష్, ఉత్తమ్ మల్లేష్,నామాల యదగౌడ్, మధు,కాముని నర్సింలు,కాల్వల స్వామి, విద్యార్థి నాయకులు ఉత్తమ్ మహేష్ జీడిపల్లి రాజు, తదితరులు ఉన్నారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-అక్కన్నపేట



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఆదివారం అక్కన్నపేట మండలంలోని అంతకపేట గ్రామంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపు కార్యక్రమంలో భాగంగా పల్లె పల్లెకు ప్రవీణన్న, గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో మండల పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, గ్రామ అధ్యక్షులు కాశ బోయిన రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ తరుణంలో మహిళలు, గ్రామస్తులు, ప్రవీణ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం గూర్చి పట్టించుకోవడం లేదన్నారు. తానూ రైతేనని ముఖ్యంగా హుస్నాబాద్ ప్రాంత రైతాంగం బాధలు తనకు తెల్సని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రమే రైతులకు సరైన న్యాయం జరిగిందని, స్థానికేతరుడైన ఎమ్మెల్యేకు ఇక్కడి రైతుల గోస పట్టడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గౌర వెళ్ళి ప్రాజెక్టుకు శంఖు స్థాపన చేసి 70 శాతం పూర్తి చేశారని అన్నారు. మిగిలిన భాగాన్ని పదేళ్లుగా పూర్తి చేయక పోగా, భూ నిర్వాసితులకు సైతం సరైన న్యాయం చేయలేదన్నారు. పేద వారికి సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తామని, రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, అక్కన్న పేట మండల పార్టీ అధ్యక్షులు జంగపల్లి అయిలయ్య, హుస్నాబాద్ మండల అధ్యక్షులు బంక చందు, కోహెడ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కాశవేన రవీందర్, మాజీ పీసీసీ సభ్యులు చిట్టంపల్లి అయిలయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ లు ఎగ్గిడి అయిలయ్య, భూపతి ముకుంద రెడ్డి, డైరెక్టర్లు బుర్ర ప్రభాకర్ గౌడ్, బండి కుమార్,తాళ్ళపల్లి కావ్య, వెంకట స్వామి, ఎంపిటిసి గొర్ల స్వప్న,శ్రీనివాస్, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాండ్రాల దామోదర్, ఎస్సీ సెల్ ఆకునూరి వెంకట్రాజం, ఎస్టీ సెల్ అధ్యక్షులు కరెంతోతు రవి, బిక్యా నాయక్, హుస్నాబాద్ కౌన్సిలర్లు వల్లెపు రాజు, పున్న లావణ్య సది, అంతక్ పేట్ వార్డు మెంబర్ కొల్ల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంభీర్పూర్‌లో బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు



నవతెలంగాణ దుబ్బాక రూరల్

గంభీర్పూర్‌లో బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఇంచార్జ్ పర్స దేవరాజ్ చెప్పారు. ఆదివారం దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీపీ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో నూతనంగా బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా కమిటీలు వేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న కమిటీ అధ్యక్షులు రాబోయే కాలంలో దుబ్బాకలో గులాబీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ప్రతిపక్ష నేతలు చేసే అసత్య ప్రచారాలను నమ్మకుండా ఎప్పటికప్పుడు తిప్పి కొట్టే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. కార్యక్రమంలో కేపీఆర్ యువసేన ఇంచార్జ్ నాయకులు పర్స దేవరాజ్, జగన్ గౌడ్, పున్న శివ శెంకర్, మార్కంటి నవీన్,, రఘువరన్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

శిలాజీనగర్ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ కమిటీలు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం శిలాజీనగర్ గ్రామంలో ఆదివారం మెదక్ ఎంపీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ కమిటీలు వేశారు. ఈ సందర్భంగా కమిటీ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు గ్రామంలోని ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. అలాగే రానున్న ఎన్నికల్లో మెదక్ ఎంపీ దుబ్బాక ఎమ్మెల్యేగా విజయం సాధించడం కోసం కార్యకర్తలు, నూతన కమిటీ అధ్యక్షులు పని చేయాలన్నారు. ఇక దుబ్బాకలో తిరిగి గులాబీ జెండా ఎగరడమే లక్ష్యంగా పని చేస్తామని నూతన బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ కమిటీలు అధ్యక్షులు అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల పార్టీ నాయకులు, కేపీఆర్ సేన మండల కమిటీ ఇన్‌చార్జిలు అంబటి జగన్ గౌడ్, పర్స దేవరాజ్, అంబటి రఘువరన్, మార్కంటి నవీన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సొంత ఖర్చుతో బావి పూడ్చివేత



నవ తెలంగాణ -దౌల్తాబాద్

మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు పర్యటించారు. ముదిరాజు కాలనీలో ప్రమాదకరమైన పాత బావి ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యే సొంత ఖర్చుతో బావిని పూడ్చారని మాజీ జడ్పిటిసి సరుగారి వీరమని భూపాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ గడ్డమీద సత్తయ్య ఉపసర్పంచి నగేష్ బిజెపి మండల సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్ తిరులాపూర్ శక్తి కేంద్రం ఇన్చార్జి భాను ప్రసాద్, భూత అధ్యక్షుడు గడ్డం స్వామి, శీను, మధు, ఎల్లం, వెంకట్, రాజయ్య, కృపాకర్, బూదయ్య, ఎల్లా గౌడ్, భాస్కర్, శీను. పాల్గొని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రమైన నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000- 2001 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చదువు చెప్పిన గురువుల సమక్షంలో సమక్షంలో యోగ,క్షేమ తెలుసుకొని ఆత్మీయంగా పలకరించుకొని సమావేశంలో మాట్లాడారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు ఆర్. రామచంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహ్మ స్వామి, రామచంద్రారెడ్డి, నరసింహ్మ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డిలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు బెదురు తిరుపతి, తుకారం, లక్ష్మీనరసయ్య, మల్లేశం, సుధాకర్, చంద్రకాంత్, శివకుమార్, సురేందర్ రెడ్డి, శిల్ప, జ్యోతి, భవాని, సజిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్ తో విద్యార్థి విజయ్ మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు మృతుడి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కన్న పిల్లలు తల్లిదండ్రుల ముందే మృతి చెందడం ఆ కుటుంబానికి తీరనిలోటన్నారు. గ్రామంలో ప్రజల నివాసం ఉంటున్న గృహాలపై నుండి విద్యుత్ సరఫరా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఉమ్మడి దౌల్తాబాద్ విద్యుత్ అధికారి వాసుదేవరావు చరవానితో మాట్లాడారు. గ్రామంలో సుమారు 100 మీటర్ల వరకు భూమి లోపల నుంచి కేబుల్ వేసి విద్యుత్ సరఫరా చేయాలని అధికారికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు పొద్దంతా పనిచేసే రాత్రి సమయంలో ఇంటి పైకప్పు ఎక్కి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని ఆయన విద్యుత్ అధికారికి తెలిపారు. సమస్యను సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం చేయాలని విద్యుత్ అధికారులను కోరారు. కార్యక్రమంలో మమ్మసాపూర్ మాజీ సర్పంచ్ అబ్బ గౌరీ రామస్వామి గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కుమ్మరి నరసింహులు, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవ తెలంగాణ కొండపాక

మండల పరిధిలోని దుద్దెడ జాగృతి (ఫ్రెండ్స్) అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు నారోజు రవీంద్ర చారి పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాసాని బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పబ్బోజు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తుమ్మనపల్లి నాగరాజు, కోశాధికారిగా తుమ్మనపల్లి హరీష్, సహాయ కార్యదర్శిగా బుస్స శ్రీనివాస్, సలహాదారులుగా వడ్లకొండ శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నర్ర ధనుంజయ రెడ్డి, చిలగాని శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సంక్షేమం కొనసాగించే దిశగా ముందుకు సాగుతానన్నారు. నిరుపేదలకు సాయం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాట రమేష్, నరహరి, పెద్దంకుల శ్రీనివాస్, పంజాల బాల్ రాజ్, శ్రీకాంత్ ,తిరుపతి మల్లేశం, పబ్బోజు రాజయ్య వీరేశలింగం పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి అనంతరం ఇందిరాపార్క్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు నాయిని యాదగిరి, పరుచూరి రాజు మాట్లాడుతూ ఎన్టీ రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శతజయంతి వేడుకలు నిర్వహించుకున్నామన్నారు. గత సంవత్సరం కాలంగా విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. శత జయంతి అందరికీ పండుగ రోజు అని, ఈ లోకంలో ఎంతో మంది పుడుతుంటారు కానీ కొంతమంది మాత్రమే చరిత్ర పుటల్లో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అలాంటి మహానుభావుల్లో ఎన్టీఆర్ అగ్రభాగాన నిలుస్తారని, వెండితెరపై నవరసాలు అలవోకగా పండించి ప్రజల గుండెల్లో నిలిచిపోయినట్లు వారు పేర్కొన్నారు. , రాజకీయరంగంలోకి ప్రవేశించి "పేదవాడే నా దేవుడు - సమాజమే నా దేవాలయం" అంటూ తెలుగుదేశం పార్టీ స్థాపించి 9 నెలల లోపే అధికారం చేపట్టి ప్రజారంజక పరిపాలన చేసిన ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రపంచం మెచ్చిన నేత ఎన్టీఆర్ అని అన్నారు .ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ దేవాలయం డైరెక్టర్ ఆర్యే శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తుమ్మ నరసింహులు, వేంకటేశ్వర్లు, రాము, ఓంకార్, భాను ప్రసాద్, సుమో శ్రీనివాస్, మొచే ప్రభాకర్,రాములు,భద్రయ్య టీచర్ సత్యనారాయణ, మల్లికార్జున్, అభిమాన సంఘం నాయకులు, మర్యాల శ్రీనివాస్, ఉప్పల రమేష్, శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.